క్లుప్తంగా

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అంకగళ్ల కుమార్

కందుకూరు: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని మండల కార్యదర్శి అంకగళ్ల కుమార్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న ఈ సదస్సుకు రాష్ట్ర మంత్రి సీతక్క, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు బి వెంకట్, రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య, ఎంపీ శివదాసన్ తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సదస్సుకు వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

డీకే అరుణకు అభినందనల వెల్లువ



ఎంపీ డీకే అరుణను అభినందిస్తున్న శూరకర్ణారెడ్డి

బడంగ్‌పేట్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి బీజేపీ తరుపున ఘన విజయం సాధించిన ఎంపీ డీకే అరుణను శనివారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడకు చెందిన బీజేవైఎం రాష్ట్ర నాయకులు శూరకర్ణారెడ్డి ఘనంగా సన్మానించారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా విజయం సాధించిన ఈటెల రాజేందర్‌ను కలిసి ఘనంగా సన్మానించారు. తెలంగాణలో గెలిచిన 8 పార్లమెంట్ నియోజకవర్గాలను పెద్దెతున అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో రూపాయల్లో)... టమాట 31, వంకాయ 23, బెండ 40, పచ్చిమిర్చి 60, కాకర 38, బీర 40, క్యాబేజీ 21, ఫ్రెంచి బీన్స్ 95, క్యారెట్ 40, దొండ 15–18, చిక్కుడు 55, గోకర 40, బీట్‌రూట్ 23, క్యాప్సికం 65, ఆలు 33, దోస 28, సొర 11, పొట్ల 18, ఉల్లిగడ్డ 29, చామగడ్డ 40. ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

మురుగు సమస్యను పరిష్కరించండి



వీరభద్రనగర్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌కు వెళ్లే మార్గంలో పారుతున్న మురుగు

మన్సూరాబాద్: డివిజన్ హయత్‌నగర్ పరిధి వీరభద్రనగర్ కాలనీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డులో కొన్ని రోజులుగా డ్రైనేజీ పొంగి మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. ఈ విషయమై సీవరేజ్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై మురుగు పారుతుండటంతో తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు, వాహనదారులు చెప్తున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు మురుగులోనే గడపాల్సిన దుస్థితి ఏర్పడింది. పాలకులు, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులలో ప్రజలు భాగస్వాములు కావాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పనులు త్వరితగతిన పూర్తి కావడమే కాకుండా పనుల్లో నాణ్యత ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. శనివారం హస్తినాపురం డివిజన్‌లోని అగ్రిల్చర్ కాలనీ నుంచి జయకృష్ణ ఎన్‌క్లేవ్ కాలనీ వరకు నిర్మిస్తున్న వర్షపునీటి కాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాకాలం సమీపిస్తున్నందున అభివృద్ధి పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. ఈ విషయంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఇవేం తాగునీరు బాబోయ్..!

అస్తవ్యస్తంగా సరఫరా

- ప్రబలుతున్న వ్యాధులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో తాగేనీరు సక్రమంగా సరఫరా కావడంలేదు. దీంతో నల్లానీరంటేనే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఔటర్ రింగు రోడ్డు లోపల తుక్కుగూడ, రావిర్యాల, సర్దార్‌నగర్, దేవేందర్‌నగర్‌కాలనీ, బాసగూడ తండా, ఆర్‌సీఐ, తదితర గ్రామాల్లో సుమారు 4,900 వరకూ మంచి నీటి కనెక్షన్లు ఉన్నాయి. వారికీ రోజు విడిచి రోజు సుమారు 2.5యంఎల్ లీటర్ల నీటిని వదులుతున్నారు.

ఎరుపు రంగులో..

హెచ్ఎండబ్ల్యూఎస్ సరఫరా చేస్తున్న నీరు సురక్షితంగా కాకుండా దుమ్ము, ధూళితో కలిసి ఎరుపు రంగులో వస్తున్నాయి. దీంతో ఈ నీరు పట్టుకోవడానికి ప్రజలు జంకుతున్నారు. తాగాలంటేనే ఆందోళనకు గురవుతున్నారు. ప్రతీ నెల వేల రూపాయలు నీటి పన్ను వసూలు చేసుకుంటున్న అధికారులకు ఇవీ కనిపించవా? అని ప్రశ్నిస్తున్నారు. కలుషిత నీరు తాగిన ప్రజలు కొందరు వ్యాధుల బారిన పడ్డారు. ఆస్పత్రులపాలై రూ. వేలల్లో సమర్పించుకుంటున్నారు. కలుషిత నీరు రాకుండా స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని సంబంధిత శాఖ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఐనప్పటికీ ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైంది. వర్షాకాలంలో ఇలాంటి నీరు తాగితే తాము సీజనల్ వ్యాధులకు గురయ్యే ప్రమాదం లేకపోలేదని స్థానికులు భయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి తాగు నీరు కలిషితం కాకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.



తుక్కుగూడలో ఎరుపురంగును పోలిన పాకురుతో సరఫరా చేస్తున్న తాగునీరు

పైప్‌లైన్ పనులు నిలిచిపోయాయి

తుక్కుగూడ పట్టణ కేంద్రంలో వారాంతపు సంతలో లక్ష లీటర్ల నిల్వ చేసే అతిపెద్ద మంచి నీటి ట్యాంక్‌ను హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు నిర్మించారు. ఈ ట్యాంక్ నుంచి తుక్కుగూడ పాతబస్తీకి నీటి సరఫరాకు నూతనంగా పెద్ద పైపులైన్ వేయాల్సి ఉంది. శ్రీశైలం జాతీయ రహదారి క్రాసింగ్ చేయడానికి రోడ్డు తవ్వకాల కోసం ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడంతో పైపులైన్ పనులు నిలిచిపోయాయి. దీంతో ఇక్కడి ప్రజలకు సరిపడే నీరు రాక ఇబ్బందులు పడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

మున్సిపాలిటీలో ఔటర్ రింగు రోడ్డు లోపల తాము హెచ్ఎండబ్ల్యూఎస్ ద్వారా మంచినీటి సరఫరా చేస్తున్నాం. మున్సిపాలిటీ శాఖ సహకారంతో ఎలాంటి ఇబ్బందులు కలగకుండ తగు చర్యలు తీసుకుంటాం. కలిషిత నీరు రాకుండా వెంటనే చర్యలు తీసుకుంటాం.

– గోపాల్, ఏఈ (హెచ్ఎండబ్ల్యూఎస్)



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న నిరంజన్‌రెడ్డి, కౌన్సిలర్లు

ఆదిబట్లను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మున్సిపాలిటీలోని 2వ వార్డు వేదపురి కాలనీలో రూ.7 లక్షలతో సీసీ రోడ్డు, 11వ వార్డులో బాలాజీ నగర్‌లో రూ.15లక్షలతో సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్లు కుంట్ల మౌనిక ఉదయ్‌పాల్‌రెడ్డి, మర్రి అర్చన రాంరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిబట్ల మున్సిపాలిటీ పేరుకు చిన్నదే అయినా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిందన్నారు. ఏరోస్పేస్, టాటా కంపెనీలు, ఔటర్‌రింగ్‌రోడ్డు, టీసీఎస్ లాంటి సంస్థలకు నెలవుగా ఉందన్నారు. రియల్ ఎస్టేట్ రంగం ఇక్కడే అభివృద్ధి అవుతుందని చెప్పారు. బహుళజాతీ కంపెనీలు ఉన్న చోట పలు ప్రాంతాల నుంచి ప్రజలు వస్తున్నారని తెలిపారు. ఇక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకొని బతుకుతున్నారని వారికి మౌళిక సదుపాయలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నమన్నారు. 15 వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అధికారులు నిరంతరం కాలనీల్లోని సమస్యలు తెలుసుకొని పరిష్కరించడానికి కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కమాండ్ల యాదగిరి, ఏఈ వీరాంజనేయులు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, రామారావు, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణ, పాండుగౌడ్, ప్రవీణ్‌గౌడ్ ఉన్నారు.



ఇబ్రాం నర్సమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమెల్యే సబితారెడ్డి, కార్పొరేటర్లు

ఇబ్రాం నర్సమ్మకు ఘన నివాళి

బడంగ్‌పేట్: బాలాపూర్ వాసి, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ మాతృమూర్తి ఇబ్రాం నర్సమ్మ దశదినకర్మ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి పాల్గొని ఘన నివాళులర్పించారు. నర్సమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. నివాళులర్పించిన వారిలో మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, డీఎస్‌పీ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, రవికుమార్, మంద అమర్, తుంకంటి సాయికుమార్, యూనివర్శిటీల విద్యార్థి సంఘం నాయకులు సందీప్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు నర్సింహా మాదిగ, చినబాబు మాదిగ, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేటర్లు ఎస్ అర్జున్, పవన్‌యాదవ్, శివకుమార్, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, రాళ్లగూడం శ్రీనివాస్‌రెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి, బండారి మనోహర్, ఎర్ర జైహింద్‌కుమార్, కమిషనర్ రఘు, మేనేజర్ నగేశ్, మాజీ సర్పంచ్ చారి, వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, బోయపల్లి శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సంరెడ్డి వెంకట్‌రెడ్డి, సూర్ణగంటి విజయ్‌కుమార్, గట్టు బాలకృష్ణ, కుమార స్వామి, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి చైర్మన్ కళ్లెం నిరంజన్‌రెడ్డి, తిమ్మని గిరీష్, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మృగశిర కార్తె చేపలకు డిమాండ్

- కిటకిటలాడిన చేపల మార్కెట్
- ఆహారంగా తీసుకోడం ఆనవాయితీ
- రవ్వ కిలో రూ.200లనుంచి రూ.300 వరకు అమ్మకాలు

కందుకూరు: మండలంలో ఘనంగా మృగశిర కార్తె నిర్వహించుకున్నారు. వర్షాకాలం ప్రారంభంలో ఈ కార్తె ప్రవేశిస్తుంది. దీంతో రైతులు పొలం పనులను సంతోషంగా కార్తె రోజు మొదలు పెడతారు. దీని కోసం దుక్కులు సిద్ధం చేసుకుంటారు. మరోవైపు మృగశిర కార్తె అంటే ప్రతీఒక్కరూ చేపల పండుగగా గుర్తిస్తారు. ఈ రోజున ప్రతీ కుటుంబం చేపలు వండుకోవడం ఆనవాయితీ అని చెబుతారు. శనివారం మండలంలోని చేపల మార్కెట్ కొనుగోలు దారులతో కిటకిట లాడింది. చేపలకు భలే డిమాండ్ పెరిగింది. వ్యాపారులు రవ్వ, బొచ్చే కిలో రూ.200 నుంచి రూ.300లకు పైగా విక్రయించి సొమ్ము చేసుకున్నారు. మృగశిర కార్తె రోజు చేపలను తింటే ఆరోగ్యానికి మంచిదని, చేపమందుగా, ఔషధంగా పనికి వస్తుందని అనాదిగా వస్తుంది. దీంతో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో చేపల విక్రయాలు జోరందుకున్నాయి. శాఖాహార ప్రియులు మాత్రం బెల్లం, ఇంగువ తినడంతో పాటు అడవుల్లో, పొలాల్లో దొరికే ఆదొండ కాయలతో ప్రత్యేకంగా కూర చేసుకోవడం ఆనవాయితీ అని చెబుతున్నారు.



చేపలు కొనేందుకు వచ్చిన వినియోగదారులు

జల్‌పల్లి చెరువుకు మృగశిర శోభ

పహాడీషరీఫ్: జల్‌పల్లి పెద్ద చెరువుకు శనివారం మృగశిర శోభ సంతరించుకుంది. 100 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువులో నీరు పుష్కలంగా ఉండడంతో చేపల పెంపకందారులు ఆరు నెలల క్రితమే చేప పిల్లలను వదిలారు. దీంతో ప్రస్తుతం ఒక్కో చేప కిలో నుంచి నాలుగు కిలోల వరకు తూకం పెరిగాయి. జల్‌పల్లి, కాటేదాన్, లక్ష్మీగూడ, పాతబస్తీల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి చేపలు కొనుగోలు చేశారు. చెరువు నుంచి బతికి ఉన్న చేపలను పట్టుకొచ్చి విక్రయిస్తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. దీంతో విరివిగా కొనుగోలు చేశారు. రవ్వ, బొచ్చె, గ్యాస్‌కట్, పాంప్లెట్‌లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరిచారు.



జల్‌పల్లి చెరువు వద్ద చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

కక్షిదారులు రాజీమార్గం ఎంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

ఇబ్రహీంపట్నం: కక్షిదారులు పట్టింపులకు వెళ్లకుండా కేసుల పరిష్కారానికి రాజీమార్గం ఎంచుకోవాలని ఇబ్రహీంపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ మెగాలోక్ అదాలత్‌ను ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయా కేసుల్లోని కక్షిదారులు రాజీపడితే ఇరువర్గాలకు సత్వర న్యాయం లభిస్తుందన్నారు. మానసిక ఆందోళన తగ్గడమేగాక సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. కాగా, లోక్ ఆదాలత్‌లో 2718 కేసులు పరిష్కారమయినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి యశ్వంత్‌సింగ్, న్యాయమూర్తి జయసింహ, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వరలక్ష్మి, న్యాయవాదులు మాదన్న, నరేందర్‌లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులను నిర్లక్ష్యం చేయొద్దు

చైతన్యపురి: శానిటేషన్ పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడం లేదని కాలనీల ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో శనివారం ఆయన జీహెచ్ఎంసీ శానిటేషన్ అధికారులతో వీవీ నగర్‌లో సమావేశమయ్యారు. కాలనీల్లో రోడ్లు శుభ్రం చేయడం లేదని, ఎక్కడ చూసినా చెత్త కుప్పలు కనిపిస్తున్నాయన్నారు. విద్యుత్ సిబ్బంది చెట్ల కొమ్మలను నరికి అలాగే వదిలేయటంతో కాలనీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కొమ్మలు తరలించేందుకు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. శానిటేషన్ పనులు సక్రమంగా నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో శానిటేషన్ ఈఈ నీలిమ, సూపర్‌వైజర్ బుచ్చయ్య, జవాన్ యాదగిరి, రాంకీ భరత్, దయాకర్, ఎస్ఎఫ్ఏ పండు, సంజీవరెడ్డి, యాకయ్య, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సీజీఆర్ చైర్‌పర్సన్ లీలాలక్ష్మారెడ్డి

కడ్తాల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతోందని కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చెర్‌పర్సన్ లీలాలక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ పూజలు జరిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ఫల పంచామృత అభిషేకం, అలంకరణ, పత్రిపూజ, హనుమాన్ చాలీసా పారాయణం, సత్యనారాయణ స్వామివ్రతం, మంగళ హారతి, హోమ పూజలు, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లీలాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనించాలని సూచించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు లక్ష్మారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యా నాయక్, భాస్కర్‌రెడ్డి, లక్ష్మయ్య, సత్యం, శేఖర్, ప్రభులింగం, శంకర్, జగన్‌గౌడ్ ఉన్నారు.

అధ్వానంగా అంతర్గత రహదారులు

- వర్షాలకు గుంతలు పడి ధ్వంసమైన సలీంనగర్‌లోని రోడ్లు
- మరమ్మతులపై అధికారుల నిర్లక్ష్యం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్‌లో అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతినడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మలక్‌పేట నుంచి సలీంనగర్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి, స్థానిక కాలనీ పార్కు-2 సమీపంలో మొన్నటి వరకు అద్దంలా ఉన్న రోడ్లు వర్షానికి గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయి. అధికారులు రోడ్లకు మరమ్మతు చేపట్టకపోవడంతో లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన రోడ్లు పూర్తిగా దెబ్బతింటున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిటీ నుంచి సలీంనగర్ కాలనీకి రావడానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. పాడైన రోడ్ల వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సలీంనగర్ వాసులు కోరుతున్నారు.



సలీంనగర్-2, పార్కు సమీపంలో ధ్వంసమైన రోడ్డు

నోట్ బుక్స్ పంపిణీ



ఆదరణ ఫౌండేషన్‌లో నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మన్సూరాబాద్: టీపీసీసీ ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్ రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నేతలు వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలోని రోగులకు బ్రెడ్, పండ్లు శనివారం పంపిణీ చేశారు. అనంతరం లింగోజిగూడ డివిజన్ కృష్ణానగర్ కాలనీలోని ఆదరణ ఫౌండేషన్‌లోని విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జాల వెంకట్‌రెడ్డి, కొలను సుధాకర్, ఎర్ర మహేందర్, రాజశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బుంగ రాజు పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించండి

వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

కడ్తాల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే, వికలాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, గీత కార్మికులకు రూ.4 వేల పింఛన్ పెంచి ఇస్తామని హామీ ఇచ్చింది. వెంటనే హామీని నిలబెట్టుకోవాలని, వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య డిమాండ్ చేశారు. శనివారం మండలంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలైన, వికలాంగుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వికలాంగులకు ఉచిత రవాణాతో పాటు వారి సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. జూన్ 22న కడ్తాల్ మండల కేంద్రంలో రంగారెడ్డి జిల్లా వికలాంగుల సదస్సును నిర్వహించనున్నట్లు చెప్పారు. త్వరలోనే మందకృష్ణ మాదిగ నాయకత్వంలో చలో హైదరాబాద్ కార్యక్రమం కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు చిట్టి రాజు, జిల్లా అధికార ప్రతినిధి యాచారం జంగయ్య, సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, నాయకులు జంగయ్య, నర్సింహ, మహ్మద్ సలీం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య